ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 • కనిష్ఠం : 18.5
ANDHRAJYOTHY 5
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
శనివారం 29 నవంబరు 2025



పదవుల వేలంపై ఆగ్రహం

- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్
- కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ కుమార్

గద్వాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లాలో గ్రామ సర్పంచు పదవులకు వేలం పాట నిర్వహణపై కలెక్టర్ బీఎం సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై వివిధ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలను పరిశీలించిన ఆయన, శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని సూచించారు. అంతే కానీ పదవులకు వేలం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 171ఏ అక్రమ ప్రవర్తనలు, 171బీ లంచగొంటితనం, 171సీ ఓటర్లపై అనుచిత ప్రవర్తన, బెదిరింపులకు దిగడం వంటివి నేరాలుగా పరిగణించ బడుతాయని పేర్కొన్నారు. అనైతిక చర్యలకు పాల్పడితే పోటీ చేసేందుకు అనర్హులు అవుతారని స్పష్టం చేశారు. నామినేషన్ సందర్భంగా ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, ప్రలోభాలకు గురిచేసినా ఫిర్యాదు చేయాలని కోరారు.

పారే ఏరు.. కొంగల జోరు



అలుగు వద్ద చేపల కోసం నిరీక్షిస్తున్న కొంగలు

పారే ఏరు లోనంట.. చేపల కోసం కొంగల వేట..
దొరికే దాకా తప్పని తండ్లాట.. అప్పటిదాకా ఆడుకుందాం ఆట..

అన్నట్లుగా జలజలా పారుతున్న దుందుభీ వాగు అలుగు వద్ద కొంగలు సయ్యాటలాడుతున్నాయి. ఈ దృశ్యం నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండలంలోని లత్తిపూర్ గ్రామ శివారులోని డిండి ప్రాజెక్టు అలుగు వద్ద 'ఆంధ్రజ్యోతి' కంటపడటంతో కెమెరా 'క్లిక్కు'మనిపించింది.

- అచ్చంపేట (ఆంధ్రజ్యోతి)



డిండీ ప్రాజెక్టు అలుగు వద్ద చేపల వేటలో నిమగ్నమైన కొంగలు

ఎర్రవల్లిలో సర్పంచ్ ఎన్నిక బహిష్కరణ

- డిండి ఎత్తిపోతల నిర్వాసితుల నిరసన

7

రియల్ బుడగ
పంచాయతీపై పడగ

- కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న స్థిరాస్తి వ్యాపారం
- పడిపోయిన ప్లాట్లు, భూముల ధరలు
- ఆశావహుల్లో ఎన్నికల ఖర్చు గుబులు
- తాకట్లు, రుణాల వైపు చూపు



ఖిల్లాఘణపూర్ మండలంలోని కమాలొద్దీన్‌పూర్ పంచాయతీ కార్యాలయం

వనపర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రియల్ ఎస్టేట్ వ్యాపారం గత రెండేళ్లగా స్తబ్దుగా ఉండటం, భూములు, ప్లాట్ల ధరలు పడిపోవడం పంచాయతీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. స్థిరాస్తి క్రయవిక్రయాలు దాదాపు నిలిచిపోవడంతో సదరు వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు రావడంతో పోటీ చేయాలనుకుంటున్న వారు డబ్బు కోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడ విన్నా పంచాయతీ ఎన్నికలపైనే చర్చే కొనసాగుతోంది. ఇప్పటికే దావత్‌లు, మందు పార్టీలు జోరుగా సాగుతున్నాయి. ఆశావహులు, నామినేషన్లు దాఖలు చేసిన వారు, చేసేందుకు సిద్ధం అవుతున్నవారు అందుకోసం ఖర్చు చేస్తున్నప్పటికీ లోలోపల వారిని డబ్బుల టెన్షన్ వేధిస్తోంది. మొత్తంలో మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చులు కొంత మేర కలిసి వస్తాయి. చివరి విడతలో పోటీ చేసే అభ్యర్థులపై మాత్రం అదనపు భారం పడనున్నది. ఈ నేపథ్యంలో ఆశావహులకు ఆందోళన తప్పడం లేదు.

నిలిచిన క్రయవిక్రయాలు

రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా నడిచిన కాలంలో ప్రధాన రహదారుల వెంట ఉండే గ్రామాల్లో ఒకటి, రెండు గుంటల భూమి అమ్ముకుంటే చాలు.. ఎన్నికల ఖర్చు సమకూతుందన్న ధీమాలో ఉండేవారు కొందరు నాయకులు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి మచ్చుకైనా కనిపించడం లేదు. ఒకవేళ కొనుగోలు చేస్తామని ఎవరైనా ముందుకు వచ్చినా, తక్కువ ధరకు అడుగుతున్నారు. దీంతో సర్పంచ్ అభ్యర్థులు ఖర్చులకు డబ్బు లేక అప్పులు చేసేందుకు సిద్ధం అవుతు న్నారు. బంగారం మొదలుకొని ఇళ్లు, పొలాలు, ప్లాట్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లతో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, తనఖా వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు ఎంత వస్తే అంత అన్నట్లుగా వడ్డీ వ్యాపారులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి మొదటి విడత ఎన్నికలు జరగనున్న మండలాల్లో ఈ అంశం చర్చనీయంగా మారింది.

పరిమితికి మించి ఖర్చు!

స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చులకు ఎన్నికల కమిషన్ కచ్చితమైన వ్యయ పరిమితిని విధించింది. 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో రూ. 2.50లక్షలు, వార్డు సభ్యుడికి రూ. 50వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న పంచాయతీల్లో సర్పంచ్‌కు రూ.1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ. 30 వేలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల అనంతరం ఖర్చులన్నింటినీ సంబంధిత ఆధారాలు, రశీదులతో సహా ఎన్నికల కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థుల ఖర్చులపై ప్రతీ నిత్యం అధికారుల నిఘా కూడా ఉంటుంది. కానీ ఎన్నికల వ్యయపరిమితికి మించి అభ్యర్థులు ఖర్చు చేస్తారన్నది బహిరంగ రహస్యం.

స్థానాన్ని బట్టి ఖర్చులు

గ్రామ పంచాయతీ రిజర్వేషన్లను బట్టి ఎన్నికల ఖర్చులు మారనున్నాయి. జనరల్, బీసీ స్థానాల్లో ఖర్చు ఎక్కువ అవసరం ఉండగా, ఎస్సీ ఎస్టీ స్థానాల్లో సగం మేర ఖర్చు తక్కువగా ఉంటుంది. ఈసారి జనరల్ స్థానాలు ఎక్కువగా ఉండడంతో, ఆర్థికంగా బలంగా ఉన్న వారు పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 268 గ్రామ పంచాయతీలు ఉండగా, ఈసారి 180 స్థానాలు జనరల్‌కు వచ్చాయి. దీంతో ఇప్పటికే పదవులు చేపట్టిన వారితో పాటు, కొత్త వారు కూడా పోటీకీ సై అంటున్నారు. గత ఎన్నికల్లోనే సర్పంచులుగా గెలిచేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేసిన వారు, ఈ ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నా రు. ఈ సారి ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

పోటీకే బెట్టు..
గెలిచాక తాకట్టు



- గెలిచిన తర్వాత ఏదో ఒక పార్టీలో చేరుతాం
- గ్రామాల్లో బలం ఉన్న సర్పంచు అభ్యర్థుల తీరిది..
- పార్టీల నాయకులను ఖర్చులకు డబ్బులు అడుగుతున్న అభ్యర్థులు
- గెలిచిన తర్వాత చూద్దామనే ధోరణిలో నాయకులు
- ఆశావహులు ఎక్కువగా ఉండటంతో ఎవరికీ అడ్డుచెప్పని పరిస్థితి



మహబూబ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్ల స్వీకరణ రెండో రోజుకు చేరుకుంది. గ్రామాల్లో ఓవైపు ఏకగ్రీవాల కోసం వేలంపాటలు, చర్చలు జరుగుతున్నాయి. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు కూడా గ్రామాల్లోనే పర్యటిస్తున్నారు. క్యాంపు ఆఫీసుల్లో కూడా గ్రామాలకు సంబంధించిన చర్చలే నడుస్తున్నాయి. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ ఎక్కువగా ఉంది. ఇప్పటికీ గ్రామాల్లో బలంగా ఉన్నా బీఆర్‌ఎస్‌కు కూడా పోటీ అధికంగా ఉండటంతో ఎవరికి మద్దతు ప్రకటించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అయితే పార్టీల గుర్తులపై పోటీచేసే ఎన్నికలు కాకపోవడంతో అందరూ తమ రాజకీయ వ్యూహాలకు పదునుపెడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో గ్రామాల్లో మెజారిటీ సాధిస్తే వచ్చే ఎన్నికలకు కూడా సులభంగా ఉంటుందనే భావన వారిలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. కొం దరు పెండింగ్ బిల్లులపై డిమాండ్ చేస్తుండగా.. మరికొందరు ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఊరి అభివృద్ధికి ఎన్ని నిధులు ఇస్తారనే విషయాన్ని గ్రామస్థులు అడుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీల మద్దతు దక్కని ఆశావహులు అప్పుడే జంపింగ్ అవుతున్నారు. పరిగి నియోజకవర్గ పరిధిలోని మహమ్మదాబాద్, గండీడ్ మండలాల్లో కొందరు కాంగ్రెస్ నుంచి మద్దతు రాదనే అనుమానంతో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. అయితే ఇదంతా తాత్కాలికంగా మద్దతు కోసమే జంపింగ్ ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇరు పార్టీలతో డబ్బులు..

ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో పోటీ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, కొంతమేర బీజేపీ ఉండొచ్చని భావిస్తుండగా.. పోటీలో ఉండే అభ్యర్థులు ఇటు మద్దతు తెలపకపోతే అటు.. అక్కడ తెలపకపోతే ఇటు అన్నట్లుగా గోడ మీద పిల్లుల చందంగా

(మిగతా 7లో..)



ఆచితూచి అడుగులు..

ఆశావహుల నుంచి పోటీ ఎక్కువగా ఉండటం.. క్షేత్రస్థాయిలో బలం లేనివారు కూడా తాము సీనియర్లమని, తమకు మద్దతు తెలపాలని కోరుతుండటంతో ఎమ్మెల్యేలకు కొంత ఇబ్బంది ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో మద్దతు అడిగిన వారెవరికీ కాదనడం లేదు. ఎవరు గెలిచి వస్తే వారికే అభివృద్ధిలో సహకరిస్తామని హామీ ఇస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు ఆశావహులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక సర్వేలు నిర్వహించుకున్నట్లు కూడా తెలుస్తోంది. ఆశావహుల్లో ఎవరికి ఎంత బలం ఉంటుందనేది ఒక సర్వే.. ఎమ్మెల్యేలుగా తమ పనితీరుపై ఎలాంటి అభిప్రాయం ఉందనేది తెలుసుకోవడానికి మరో సర్వే చేయించినట్లు తెలుస్తోంది. ఒక్కో గ్రామం సర్వే కోసం రూ.10 వేల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. పోటీ తీవ్రంగా ఉండే గ్రామాల్లో మద్దతుకు కొంత ఇబ్బంది పడినా.. గెలిచి రావాలని సూచిస్తుండగా.. తక్కువ పోటీ ఉన్న గ్రామాల్లో ఎవరికి బలం ఉంటుందో వారివైపే మొగ్గు చూపుతున్నారు. గెలిచి వచ్చిన తర్వాత పార్టీ కండువా కప్పితే సరిపోతుందనే అభిప్రాయం కూడా నాయకుల్లో ఉంది. దీనివల్ల వచ్చే ఎన్నికల నాటికి గ్రామాల్లో వర్గాలుగా విడిపోకుండా ఉంటారని ఎమ్మెల్యేల భావన. అలాగే కొన్ని గ్రామాల వారికి ఏకాభిప్రాయంతో ఎవరిని అభ్యర్థిగా చూపిస్తే వారికే మద్దతు తెలుపుతామని చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నాయకులు కూడా ఇంచుమించుగా ఇదే విధానాన్ని పాటిస్తున్నారు.

కొత్త ఆలోచనలకు పదును పెట్టాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక మార్పులకు అనుగుణంగా కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి విద్యార్థులకు సూచించారు. వనపర్తి జిల్లా, మండలంలోని చిట్యాలలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన 53వ జిల్లాస్థాయి 'బాల వైజ్ఞానిక ప్రదర్శన - 2025-26', 'ఇన్‌స్పైర్ అవార్డ్స్ - 2024-25' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల్లో తార్కిక ఆలోచనలను పెంచడం కోసం సైన్స్ ఉపాధ్యాయులు రూపొందించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో 150 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు, 270 వైజ్ఞానిక అంశాలను ప్రదర్శించనున్నా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే కొత్త ఆలోచనలపై దృష్టి సారించి సాంకేతిక రంగంలో ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు ఎగ్జిబిట్స్‌ను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శ్రావ్య, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, జీసీడీవో శుభలక్ష్మి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

6

పోటాపోటీగా నామినేషన్లు

- ఉమ్మడి జిల్లాలో రెండో రోజు సర్పంచు స్థానాలకు 686..
- వార్డు స్థానాలకు 942 నామినేషన్లు
- సమర్పణకు నేడు చివరి రోజు



మొకర్లాబాద్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న సర్పంచు అభ్యర్థి

మహబూబ్‌నగర్/ కోస్గి/ నారాయణపేట/ గద్వాల/ నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల సందడి జోరందుకున్నది. అన్ని గ్రామాల్లో ఆశావహులు ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. మహిళలు కూడా ఎంతో హుషారుగా నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో గ్రామాల్లో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం జోరందుకున్నది. ఉమ్మడి జిల్లా

(మిగతా 7లో..)

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండవ రోజు దాఖలైన నామినేషన్లు

జిల్లా	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. మహబూబ్‌నగర్	139	144	211
2. నారాయణపేట	67	76	104
3. వనపర్తి	87	157	250
4. జోగుళాంబ గద్వాల	106	100	84
5. నాగర్‌కర్నూల్	151	209	293
మొత్తం	550	686	942

తెరపైకి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్

- పదిమంది విద్యార్థులలోపు ఉంటే సమీప స్కూళ్లలో విలీనం
- త్వరలో అమలులోకి రానున్న కొత్త విధానం

6

విజేతగా నిలవాలి

మీడియా సెంటర్ ద్వారా నిఘా

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

7



గుండం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులి

నల్లమలలో పెద్దపులి సఫారీ

పర్యాటకులకు కనువిందు

7

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 122.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

సమర్థవంతంగా నామినేషన్ల స్వీకరణ

- పకడ్బందీగా పరిశీలించాలి
- ఎన్నికల సిబ్బందికి నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఆదేశం



రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

తెలకపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తెలకపల్లి మండలంలోని గౌరెడ్డిపల్లి, తెలకపల్లి క్లస్టర్లలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను శుక్రవారం ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. రిట ర్నింగ్ అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం తెలకపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ పూర్తయిన అనంతరం పరిశీలన కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్ మాట్లాడుతూ సమ స్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ప్రతీ పోలింగ్ కేంద్రంలో పకడ్బందీ బందోబస్తు, పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీంలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కార్యక్ర మంలో తహసీల్దార్ జాకీర్ అలీ, ఎంపీడీవో తరుణ్, ఎంపీవో వెంకటేష్, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి ఎస్ఐ నరేశ్, కోటేశ్వరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

» పాఠశాలల రాష్ట్ర పరిశీలన సభ్యుడు జగదీశ్వర్



పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలన బృందం సభ్యులు

తిమ్మాజిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని పాఠశాలల రాష్ట్ర పరిశీలన బృందం సభ్యుడు జగదీశ్వర్ ఉపాధ్యాయులకు సూచించారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని చేగుంట జడ్పీహెచ్ఎస్ పరిసరాలను ఏఎంవో షర్ఫుద్దీన్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల మార్కుల నమోదు వంటి తదితర అంశాలను, అదేవిధంగా వారు తరగతి గదిలోకి వెళ్లి పుస్తకాలను పరిశీలించి విద్యార్థులతో చదివించారు. విద్యార్థుల ప్రశ్నపత్రాలను ఉపాధ్యాయులు ఏవిధంగా కరెక్షన్ చేస్తున్నారు, మార్కులు ఎలా వేస్తున్నారని అంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారిగా కాంప్లెక్స్ సమావేశాలకు వెళ్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రతీ సబ్జెక్టులోనూ సమగ్ర అభివృద్ధి సాధించేలా శ్రద్ధ కనబర్చాలని హెచ్ఎం శ్రీనివాసులు ఉన్నారు.

శివకుమార్‌కు అభినందనలు



ఢిల్లీలో శివకుమార్‌కు ప్రత్యేక కిట్ బహుకరించిన ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు

కల్వకుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్‌ను శుక్రవారం ఢిల్లీలోని ఐక్యరాజ్య సమితి అధికారిక కార్యాలయంలో ప్రతినిధులు సుశీల్ చౌదరి, బిసాతి భరత్‌లు అభినందించారు. సేవా బృందం ఆధ్వర్యంలో 13 సంవత్సరాల నుంచి చేస్తున్న సేవా కార్యక్రమాలను, అలాగే రైతులకు అందిస్తున్న సేవలను ఐక్యరాజ్య సమితి ప్రతినిధులకు వివరించినట్లు శివకుమార్ శుక్రవారం తెలిపారు. తనకు జాతీయ స్థాయిలో అవార్డు వచ్చిందని వివరించినట్లు పేర్కొన్నారు. సేవా బృందం బ్రోచర్ ఆవిష్కరణ చేశారన్నారు. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక కిట్ బహూకరించారని ఆయన తెలిపారు.

ప్రతిభను చాటిన మాంటిస్సోరి విద్యార్థులు



గద్వాలలో చెకుముకి పోటీల్లో గెలుపొంది షీల్డ్‌ను అందుకుంటున్న విద్యార్థులు

అలంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మాంటిస్సోరి పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీల్లో తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శుక్రవారం విలేకరులకు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు గద్వాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎనిమిదవ తరగతి విద్యార్థి రిత్విక్, తొమ్మిదవ తరగతి విద్యార్థి అఖిల్‌వంశీ, పదవ తరగతి విద్యార్థి సూరజ్ ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు డిసెంబరులో కరీంనగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రవి ప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులను ఇలాంటి పోటీల్లో చిన్న వయస్సు నుంచే పాల్గొనడం ద్వారా సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు.

టెన్నికాయిట్ టోర్నీలో క్యాతూరు విద్యార్థుల సత్తా



క్యాతూరు పాఠశాలలో జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

అలంపూర్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీలలో జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి అలంపూర్ మండలం క్యాతూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన టి లింగేశ్వర్, టి చరణ్, బి పవనఖ కుమార్ సత్తా చాటారు. వరంగల్ హనుమకొండ జిల్లా టెన్నికాయిట్(రింగ్‌బాల్) అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 21 వరకు ఐడీఎల్ పాఠశాలలో పోటీలు నిర్వహించారు. తెలంగాణ నుంచి 86 మంది బాలురు పాల్గొన్న జూనియర్ టెన్నికాయిట్ క్రీడల్లో క్యాతూర్ పాఠశాల విద్యార్థులు మెడల్, ప్రశంసా పత్రం పొందినట్లు పాఠశాల జీహెచ్ఎం మాధవి, పీఈటీ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కోచ్ బి.గోపాలం శుక్రవారం క్రీడాకారులకు మెడల్, ప్రశంశా పత్రం అందజేసి ఘనంగా సన్మానించి అభినందించినట్లు తెలిపారు.

చిన్న నీటిపారుదల పథకాల గణన




సోమశిల రహదారిలో చిన్న నీటిపారుదల పథకాల గణన చేస్తున్న గణాంక అధికారి విక్రమ్ రెడ్డి

కొల్లాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్న నీటిపారుదల పథకాల గణన కోసం గ్రామ పరిపాలన అధికారులు జీపీవోలు ఎన్యుమరేటర్లకు శుక్రవారం మండల గణాంక అధికారి విక్రమ్‌రెడ్డి ఫీల్డ్ సర్వేలో శిక్షణ ఇచ్చారు. మైనర్ ఇరిగేషన్ సెన్సస్ అనేది దేశంలో నీటి వనరుల వాడకం, లభ్యత, యాజమాన్యంపై కచ్చితమైన సమాచారాన్ని సేకరించడానికి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే భారీ ప్రక్రియ అని ఆయన తెలిపారు. బోర్, ట్యూబ్ వెల్‌లు, డగ్ వెల్స్‌కు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. జియో ట్యాగింగ్ జీపీఎస్ కోఆర్డినేట్స్ ప్రతీ నీటి వనరు యొక్క కచ్చితమైన భౌగోళిక స్థానం సేకరించడం దానికి జియో ట్యాగింగ్ ఎలా చేయాలో గ్రామ పరిపాలన అధికారులకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు.

తెరపైకి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్

» పది మంది విద్యార్థులలోపు ఉంటే సమీప స్కూళ్లలో విలీనం

» త్వరలో అమలులోకి రానున్న కొత్త విధానం



వనపర్తి విద్యావిభాగం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టబోతుంది. తక్కువ సంఖ్యలో పది మందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను సమీప పాఠశాలలో విలీనానికి అడుగులు వేస్తుంది. దీని కోసం ప్రస్తుతం నడుస్తున్న ఆదర్శ పాఠశాలల మాదిరిగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను తీసుకురావడానికి ప్రభుత్వం సమాయత్తమవుతున్నట్లుగా సమాచారం. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను అమలు చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో విజయవంతం అయితే త్వరలోనే తెలంగాణలోని అన్ని జిల్లాల్లోను ఈ వ్యవస్థను తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది.

● ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే చోట

పది మందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను సమీక్ష పాఠశాలలో విలీనం చేసి వాటిని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మార్చనున్నారు. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు బోధన అందించనున్నారు. ఏకోపాధ్యాయ, తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను విలీనం చేయడంతో విద్యార్థులు తరగతులు కోల్పోయే అవకాశం తక్కువగా ఉంటుంది. గతంలో ఏదైనా ఇతరాత్ర కారణాలతో ఏకోపాధ్యాయుడు పాఠశాలకు రాకపోయినట్లయితే ఆ రోజు తరగతులను విద్యార్థులు కోల్పోయేవారు. అదే విధంగా పదిమంది లోపు విద్యార్థులు ఉన్న ఆ పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు, మధ్యాహ్నం భోజనం ఏజెన్సీ, పాఠశాల గ్రాంటును విడుదల చేయాల్సి వచ్చేవి. దీని వల్ల ప్రభుత్వంపై కూడా అదనపు భారం పడుతుంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను అమలులోకి తీసుకువస్తే ప్రభుత్వంపై కూడా ఆర్థిక భారం తగ్గనుంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లోను ఉదయం అల్పాహారం మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించనున్నారు.

● వనపర్తి జిల్లాలో 119 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో దాదాపు పది పాఠశాలలు మూత పడ్డాయి. పది మంది విద్యార్థుల కన్నా తక్కువ సంఖ్యతో 53 పాఠశాలలు నడుస్తున్నాయి. ఈ పాఠశాలలను సమీప పాఠశాలలో విలీనం చేసి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా మార్చనున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సీఎం పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న వనపర్తి అడిషనల్ ఎస్పీ, జిల్లా అధికారులు

అమరచింత/ఆత్మకూరు/మక్తల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాల కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి డిసెంబరు 1వ తేదీన రానున్న సందర్భంగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు, నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఒకేరోజు సీఎం పర్యటించనున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరులో ముఖ్యమంత్రి పర్యటించే స్థలాలను, ప్రారంభోత్సవాల ప్రాంతాలను వనపర్తి జిల్లా అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి, పలువురు అధికారులు పరిశీలించారు. 100 కోట్ల పైచిలుకుతో ఆత్మకూరు మండలం జూరాల గ్రామం వద్ద కృష్ణానదిపై నిర్మించనున్న బ్రిడ్జి, ఆత్మకూరు శివారులో 50 పడకల ఆసుపత్రి భవనానికి, జాతర మైదానంలో మినీ స్టేడియం నిర్మాణానికి మునిసిపాలిటీ అభివృద్ధికి 15 కోట్ల నిధుల పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అడిషనల్ ఎస్పీతో పాటు జిల్లా అధికారులు అప్పలనాయుడు, శ్రీనివాసులు, ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్‌ఐ జయన్న తదితరులు జాతర మైదానంలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అలాగే, నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ భద్రతా ఏర్పాట్లను పోలీస్ అధికారులు, మునిసిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మక్తల్ పట్టణంలోని బీసీ వెల్ఫైర్ రెసిడెన్షియల్ మైదానంలో పబ్లిక్ మీటింగ్ సమావేశ స్థలం హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి బందోబస్తుకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. డీఎస్పీ నల్లపు లింగయ్య, పుర కమిషనర్ శ్రీరాములు, ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

విద్యానిధికి రూ.5లక్షలు

» ఎమ్మెల్యే యెన్నంకు చెక్కు అందజేసిన కౌకుంట్ల ఫ్యామిలీ



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న కౌకుంట్ల చంద్రమౌళి

మహబూబ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తీసుకువచ్చిన విద్యానిధికి విరాళాలు పెద్దమొత్తంలో వస్తున్నాయి. శుక్రవారం కౌకుంట్ల కుటుంబ సభ్యులు విద్యానిధికి రూ.5 లక్షల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కౌకుంట్ల చంద్రమౌళి రూ.2 లక్షలు, వారి కుటుంబసభ్యులు కౌకుంట్ల అంజమ్మ, కౌకుంట్ల వెంకటరమణ, కౌకుంట్ల వందనలు ఒక్కొక్కరు లక్ష చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ఎమ్మెల్యే తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు. ఆయన చేస్తున్న నిబద్ధత, చిత్తశుద్ధి చూసి తానూ విద్యాభివృద్దిలో భాగస్వామ్యం కావాలన్న లక్ష్యంతో తాము తమ వంతుగా విద్యానిధికి సహాయం అందించాలని నిర్ణయించామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్తు ఉంటుందన్నారు. యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలన్నారు. విద్యార్థి తను లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, నాయకులు సిరాజ్‌ఖాద్రి, బుద్దారం సుధాకర్ రెడ్డి, మనోహర్, ప్రవీణ్, రాఘవేందర్‌పాల్గొన్నారు.

వైద్య కళాశాలను అభివృద్ధి చేయాలి

» టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్



మెడికల్ కాలేజీ వద్ద మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

గద్వాల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు మంజూరైన గద్వాల ప్రభుత్వ వైద్య కళాశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం పట్టణంలోని వైద్య కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన శంకర ప్రభాకర్, ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్ కళాశాలకు 220 సీట్లు, నాగర్‌కర్నూల్, వనపర్తి కళాశాలకు 150 సీట్ల చొప్పున అనుమతించిన ప్రభుత్వం గద్వాలకు మాత్రం కేవలం 50 సీట్లు పరిమితం చేయడం నడిగడ్డ పట్ల పాలకులకు ఉన్న వివక్ష బహిర్గతమైంద న్నారు. వంద మంది విద్యార్థినీ విద్యార్థులు ఉన్న గద్వాల కళాశాలలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్, ప్రొఫెసర్లు, ట్యూటర్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలకు బస్సులను ప్రభుత్వమే కేటాయించగా గద్వాలలో మాత్రం ఎలాంటి రవాణా సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంపై పాలకులు తక్షణం దృష్టి సారించాలని, లేని పక్షంలో ప్రజాసంఘాలు ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాయని హెచ్చరించారు. సీఎల్‌సీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండీ సుభాన్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు దానయ్య, సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి కార్తీక్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌యాదవ్, టీపీఎఫ్ నాయకులు నాగన్న ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం

» హర్షం వ్యక్తం చేసిన డీఈవో, డీవైఎస్‌వో



నిర్వాహకుల నుంచి షీల్డ్‌ను అందుకుంటున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు

గద్వాల అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా నందిమేడారం గురుకుల పాఠశాలలో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహించిన అండర్-14 బాలికల వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నది. ఈ సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లా విద్యశాఖ అధికారి విజయలక్ష్మి, డీవైఎస్‌వో కృష్ణయ్యలు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 24న జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో అండర్-14 జోనల్‌స్థాయి వాలీ బాల్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ ఐదు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కాగా, వారిలో 12 మంది బాలికలు ఎంపికై రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకు వచ్చారన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో నిజామాబాద్ జిల్లా జట్టుపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు స్వల్ప స్కోరుతో రెండవ స్థానం పొందిందని తెలిపారు. మొట్టమొదటి సారిగా గద్వాల నుంచి వాలీబాల్ బాలికల జట్టును ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపడం జరిగిందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ తోట శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం పొందడం జిల్లాకు ఎంతో గర్వకారణమన్నారు. కోచ్, మేనేజర్లు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగుల ఆత్మస్థైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

» డీవైఎస్‌వో శ్రీనివాస్



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లోని పట్టుదల, ఆత్మ స్థైర్యాన్ని ఇతరులు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా క్రీడాశాఖ అధికారి ఎస్. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ స్టేడియంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి జరీనాబేగం హాజరై జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఏదో ఒక సమయంలో వైకల్యంతో బాధపడుతారని కానీ లక్ష్య సాధనలో అది అడ్డురాదని తెలిపారు. పరుగు, చెస్, క్యారమ్స్, షార్ట్‌పుట్, ట్రై సైకిల్ క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు డిసెంబరు 3న దివ్యాంగుల దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

విజేతగా నిలవాలి

» జిల్లా వాలీబాల్ సంఘం సెక్రటరీ మహ్మద్ హనీఫ్

» రాష్ట్రస్థాయి టోర్నీకి తరలిన ఉమ్మడి జిల్లా జట్లు



ఉమ్మడి జిల్లా వాలీబాల్ బాబాలికల జట్లతో మహబూబ్‌నగర్ జిల్లా వాలీబాల్ సంఘం సెక్రటరీ మహ్మద్‌హనీఫ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీలో విజేతగా నిలువాలని జిల్లా వాలీబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్ హనీఫ్ అన్నారు. రాజన్నసిరిసిల్ల శనివారం నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్న 8వ రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల,బాలికల జట్లు తరలివెళ్లాయి. శుక్రవారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు వాలీబాల్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. క్రీడా కోట ఉద్యోగాలు సాధించారని, గుర్తింపు ఉన్న క్రీడలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య, కోచ్ పర్వేజ్‌పాష తదితరులు పాల్గొన్నారు.

జట్టు వివరాలు...

బాలుర జట్టు: చందు, సందీప్, మాదన్, ప్రశాంత్, సిద్ధు, సూర్య, ముఖిద్, వర్మ, చంద్రశేఖర్, సయ్యద్ ఇమ్రాన్, రోషన్, మహ్మద్‌హరున్.

బాలికల జట్టు: శ్రీనిధి, గీతా, వైష్ణవి, శ్రీలేఖ, అనూష, మైత్రి, పి.అనూష, మధుప్రియ, సింధు, ఐశ్వరయ్య, రితికరెడ్డి, స్వాతి.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎదిర విద్యార్థిని



పూజ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో శనివారం నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 రగ్బీ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు ఎదిర 4వ వార్డు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని పూజ ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థి ఎంపికకావటం పట్ల హెచ్ఎం హేమచంద్రుడు, పీడీ పరుశరామ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటాలి

» హెచ్ఎం శైలజ



రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీకి ఎంపికైన మణికంఠ, అకిల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని కార్పొరేషన్ పరిధిలోని చిన్నదర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజ అన్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో నేటి నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 రగ్బీ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు జిల్లా కేంద్రంలోని చిన్నదర్‌పల్లిహై స్కూల్ విద్యార్థులు మణికంత, అకిల్ ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, హెచ్ఎం శైలజా అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి జిల్లా జట్టు విజయానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు రామచంద్రయ్య, పీడీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రగ్బీ క్రీడ రాష్ట్ర పరిశీలకుడిగా శ్రీనివాసులు



శ్రీనివాసులు

ధరూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వి. శ్రీనివాసులు అండర్-17 రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్ర పరిశీలకుడిగా శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ నెల 28 నుంచి 31 వరకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో అండర్-17 రగ్బీ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పరిశీలకుడిగా నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. శ్రీనివాసులు నియామకం పట్ల డీవైఎస్‌వో కృష్ణయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ తోట శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేటి ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు భరత్‌కుమార్, బీసన్నలు అభినందించారు.

సిల్వర్‌మెడల్ పొందిన చందనకు సన్మానం



చందనను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కందనూలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి- భువనగిరిలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తి పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి మధుగని చందన సిల్వర్ మెడల్ సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు ఎంపికైన ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఫిజికల్ డైరెక్టర్ సామ రమేష్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మెల్ల సత్యనారాయణ, అంజయ్యయాదవ్, కృష్ణమోహన్, గోపాలచారి, విమలాదేవి, సఫియా సుల్తానా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక

కోయిలకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోయిలకొండ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కృష్ణవేణి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకట్‌జీ తెలిపారు. మెదక్‌లోని పటాన్‌చెరువులో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా తరుపున పాల్గొననున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

3 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



బెల్లం, పటిక సంచులు, కారు తో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

మన్ననూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు గ్రామంలో ఎక్సైజ్ అధికారులు 3 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. అచ్చంపేట ఎక్సైజ్ ఎస్‌ఐ కృష్ణయ్య ఆదేశం మేరకు శుక్రవారం అధికారులు మన్ననూరు గ్రామంలో వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ స్విఫ్ట్ కారులో 10 సంచుల్లో 3 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని, కారును సీజ్ చేశారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు సతీష్ కుమార్, సుష్మ పాల్గొన్నారు.

కృష్ణానదిలో మునిగి యువకుడి మృతి

» ఎడమ పాతాళ గంగ వద్ద సంఘటన

బ్రహ్మగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం దైవ దర్శనం కోసం వచ్చిన యువకుడు ఎడమ పాతాళగంగ వద్ద కృష్ణానదిలో మునిగి మృతి చెందాడు. బ్రహ్మగిరి ఎస్‌ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని రాళ్లగూడ గ్రామానికి చెందిన దయ్యాల యాదయ్య (45) గురువారం ముగ్గురు స్నేహితులతో కలిసి శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం వచ్చారు. వారు రాత్రి పొద్దుపోయాక నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూరుకు చేరుకున్నారు. అప్పటికే ఫారెస్టు చెక్‌పోస్టు మూసివేయడంతో ఆ రాత్రి అక్కడే ఉండి శుక్రవారం ఉదయం ఎడమపాతాళ గంగకు వచ్చారు. అక్కడి కృష్ణానదిలో స్నానం చేసేందుకు వెళ్లగా, యాదయ్య ప్రమాదవశాత్తు నదిలో జారిపడి మునిగిపోయాడు. స్థానిక మత్స్యకారుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. అతడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి వృద్ధురాలి ఆత్మహత్య

గద్వాల క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఓ వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, పెబ్బేరుకు చెందిన వృద్ధురాలు గడ్డమీది సుజాతమ్మ (65) గద్వాల జిల్లా కేంద్రంలోని రెండవ రైల్వేగేట్ సమీపంలో ఉన్న కెనాల్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నది. అందుకు కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నారాయణపేట న్యూ టౌన్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26న సింగారం చౌరస్తాలో రోడ్డు పక్కన కదలలేని స్థితిలో పడి ఉండడంతో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించగా శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని పట్టణ ఎస్సై తెలిపారు. మృతురాలు హిందీ భాషలో మాట్లాడినట్లు ఈమెకు సంబంధించిన వారు సెల్: 8712670404, 8712670383కి సమాచారం ఇచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లాల్సిందిగా ఎస్సై తెలిపారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు



జడ్చర్ల మండలంలో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

జడ్చర్ల (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని పోలేపల్లి చౌరస్తా, పోలేపల్లి, మాచారం చౌరస్తాల వద్ద ఉన్న బెల్ట్ షాపులపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. జడ్చర్ల ఎస్‌ఐ ఖాదర్ ఆధ్వర్యంలో మూడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 60 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. యజమానులపై కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన మద్యం స్వాధీనం

అలంపూర్ చౌరస్తా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని ఓ హోటల్‌పై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. తనిఖీల్లో రూ. 6,300 విలువైన 7 లీటర్ల మద్యం లభించింది. ఉండవల్లికి చెందిన హోటల్ యజమాని ఈడిగ నారాయణగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

లారీ, ట్రాక్టర్ ఢీ, ఇద్దరికి గాయాలు

ఉండవల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : లారీ, ట్రాక్టర్ ఢీకొని, ఇద్దరు గాయపడ్డారు. ఉండవల్లి ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాలపాడు గ్రామానికి చెందిన శ్రీరాములు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 24న ఉదయం ఇటిక్యాలపాడుకు చెందిన యుగంధర్‌రెడ్డి పత్తి ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా వెళ్లాడు. పని ముగించుకుని అదేరోజు రాత్రి ట్రాక్టర్‌లో తిరిగి వస్తుండగా, కర్నూలు - హైదరాబాద్ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నది. ప్రమాదంలో శ్రీరాములుతో పాటు, అతడి వెంట ఉన్న అశోక్ అనే వ్యక్తి గాయపడ్డారు. సంఘటనపై శ్రీరాములు భార్య సుజాత శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, ఆటో ఢీకొని...

మూసాపేట, (ఆంధ్రజ్యోతి) : కారు, ఆటో ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని మహ్మద్‌హుస్సేన్‌పల్లికి చెందిన శేరి కృష్ణయ్య(50), బాలస్వామి(45)లు శుక్రవారం ఆటోలో వేముల స్టేజీ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మూసాపేట స్టేజీ వద్ద ఆటో రోడ్డు దాటుతుండగా, కొత్తకోట వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ ఎల్‌అండ్‌టీ అంబులెన్సులో జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

కోస్గి, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గుట్కా, మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా, కోస్గిలోని రెండు దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. శ్రీనుకు చెందిన దుకాణంలో రూ. 16 వేలు, రవికి చెందిన దుకాణంలో రూ. 15 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే విష్ణు అనే వ్యక్తి కోస్గి నుంచి నాచారం గ్రామానికి ఆటోలో మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యం విలువ రూ. 25 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో పాడిగేదె మృతి

భూత్పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొని పాడి గేదె చనిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని శేరపల్లి (హెచ్)కి చెందిన రాజమోని చిన్నకుర్మయ్య గురువారం సాయంత్రం పొలంలో పనులు ముగించుకొని, పాడిగేదలను తోలుకొని గ్రామానికి తిరిగి వస్తున్నాడు. గ్రామ సమీపంలో గేదెలు రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీకొనడంతో ఓ పాడిగేదె చనిపోయింది. దాని విలువ రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బస్సును స్టేషన్‌కు తరలించారు.

పోటాపోటీగా నామినేషన్లు

(5వ పేజీ తరువాయి)



నామినేషన్ కేంద్రం వద్ద ఎన్నికల అధికారులు

వ్యాప్తంగా రెండో రోజు సర్పంచు స్థానాలకు 686, వార్డు మెంబర్ స్థానాలకు 942 నామినేషన్లు దాఖలయ్యాయి.

● మహబూబ్‌నగర్ జిల్లాలో రెండోరోజు శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 144, వార్డు మెంబర్ స్థానాలకు 211 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి విడత ఎన్నికలు జరుగనున్న 139 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు రెండు రోజుల్లో 252, 1,188 వార్డు సభ్యుల స్థానాలకు 282 నామినేషన్లు దాఖలయ్యాయి.

● నారాయణపేట జిల్లాలో తొలి విడత నాలుగు మండలాల్లోని 67 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. సర్పంచ్ స్థానాలకు మొదటి రోజు గురువారం 69, శుక్రవారం 76 మొత్తం 145 నామినేషన్లు దాఖలయ్యాయి. 572 వార్డు మెంబర్ స్థానాలకు గురువారం 38, శుక్రవారం 104 మొత్తం 142 నామినేషన్లు దాఖలయ్యాయి. కోస్గి మండలంలోని చంద్రవంచ, గుండుమాల్ మండలంలోని అప్పాయిపల్లి, కుమ్మరికుంట తండా గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు స్థానిక నాయకులు, గ్రామస్థులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో మొదట విడత గద్వాల, ధరూర్, గట్టు, కేటీదొడ్డి మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. మొత్తం 106 సర్పంచు, 974 వార్డు మెంబర్‌స్థానాలకు నామినేషన్లను స్వీకరిస్తున్నారు. రెండవ రోజు శుక్రవారం సర్పంచు స్థానాలకు 100, వార్డు మెంబర్లకు 84 నామినేషన్లు వచ్చాయి. తొలిరోజు సర్పంచు స్థానాలకు 68, వార్డు మెంబర్ స్థానాలకు 13 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇప్పటి వరకు మొత్తం 168 నామినేషన్లు సర్పంచు, 97 నామినేషన్లు వార్డు మెంబర్ స్థానాలకు దాఖలయ్యాయి.

● నాగర్‌కర్నూల్ జిల్లాలోని 6 మండలాల పరిధిలో 151 గ్రామపంచాయతీలకు రెండో రోజు సర్పంచు స్థానానికి 209, వార్డులకు 293 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటివరకు మొత్తం సర్పంచు స్థానాలకు 336, వార్డులకు 456 నామినేషన్లు వచ్చాయి.

● వనపర్తి జిల్లాలోని ఐదు మండలాల్లో రెండవ రోజు సర్పంచ్ పదవికి 157, వార్డు స్థానాలకు 250 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఘణపూర్, రేవల్లి, గోపాల్‌పేట, ఏదుల, పెద్దమందడి మండలాల్లోని 87 గ్రామ పంచాయతీలకు రెండు రోజుల్లో సర్పంచ్ స్థానానికి 232, 780 వార్డు స్థానాలకు గాను 276 నామినేషన్లు దాఖలయ్యాయి.

నేడు చివరి రోజు

మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నేటితో నామినేషన్ల ఘట్టం ముగియనుంది. చాలాచోట్ల ఏకగ్రీవాలు, పార్టీ పరంగా టికెట్ కోసం ఆశావహులు ప్రయత్నాలు చేయడంతో పలువురు నామినేషన్లు వేయలేదు. శనివారం చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో నామినేషన్లు రానున్నాయి. అదే సమయంలో సింగిల్ నామినేషన్లు దాఖలైన సర్పంచ్ స్థానాల ఏకగ్రీవం వివరాలు కూడా తేలనున్నాయి. రేపటి నుంచి రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్నది.



నామినేషన్ దాఖలు చేస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. నవాబ్‌పేట	42	43	43
2. మ.రూరల్	24	30	62
3. గండీడు	27	29	36
4. మహ్మదాబాద్	22	24	18
5. రాజాపూర్	24	18	52
మొత్తం	139	144	211

నారాయణపేట జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. కోస్గి	14	14	9
2. గుండుమాల్	13	17	16
3. కొత్తపల్లి	16	22	47
4. మద్దూరు	24	23	32
మొత్తం	67	76	104

నాగర్‌కర్నూల్ జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. కల్వకుర్తి	24	32	25
2. ఊర్కొండ	16	23	18
3. వెల్దండ	32	30	93
4. వంగూరు	27	62	44
5. తాడూరు	24	32	53
6. తెల్కపల్లి	28	30	60
మొత్తం	151	209	293

జోగుళాంబ గద్వాల జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. గద్వాల	28	36	48
2. ధరూరు	28	15	20
3. గట్టు	27	36	11
4. కేటీదొడ్డి	23	13	5
మొత్తం	106	100	84

వనపర్తి జిల్లా

మండలం	గ్రా.పం.	సర్పంచ్	వార్డు
1. ఘణపూర్	29	53	90
2. రేవల్లి	9	19	51
3. గోపాల్‌పేట	15	14	19
4. ఏదుల	11	8	7
5. పెద్దమందడి	23	63	83
మొత్తం	87	157	250



పోటీకే బెట్టు.. గెలిచాక తాకట్టు

(5వ పేజీ తరువాయి)

వ్యవహరిస్తున్నారు. తమ గెలుపునకు సహకరించాలని ఇరుపార్టీల నాయలను కోరుతున్నారు. ఖర్చులకు ఎంతోకొంత సాయం చేస్తే గెలిచి వస్తామని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ నాయకులు, మాజీలు గెలిచిన తర్వాత డబ్బులు ఇస్తామని చెబుతుండగా.. ఎమ్మెల్యేలు గెలిచిన తర్వాత అభివృద్ధి పనులకు సహకరిస్తామని చెబుతున్నారు. గ్రామాల్లో బలం ఉన్న ఆశావహులు మాత్రం రెండు పార్టీల నాయకుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇప్పుడు డబ్బులు ఇచ్చి గెలిపించుకున్న తర్వాత అధికారంలో కాంగ్రెస్ ఉందని, తర్వాత పార్టీ మారే అవకాశం ఉంటుందనే భావనలో మాజీలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. దీంతోపాటు ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారు పోటీలో ఉంటుండగా.. అందులో చేరితే తమకు మద్దతు లభించదేమోనని భావిస్తున్న బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నవారు.. ఈ ఎన్నికల్లో గెలిస్తే పార్టీ మారొచ్చనే చర్చ నడుస్తోంది. గెలిచిన తర్వాత నిధులు రాకపోతే తాము గ్రామాల్లో ఇబ్బందులు పడతామనే భావన కూడా అందుకు ఒక కారణంగా చెప్పొచ్చు. ఏదేమైనా ఒకవైపు ఏకగ్రీవాల వేలాలు నడుస్తుండగా.. మరోవైపు పార్టీల మద్దతు, ఖర్చుల డబ్బుల కోసం వేట సాగుతోంది.

ప్రతీ ఖర్చుకూ లెక్క

» స్థానాన్ని బట్టి వ్యయ పరిమితి

నారాయణపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు చేసే ఖర్చుపై పరిమితులను తప్పనిసరిగా పాటించాలి. 5 వేల జనాభా కలిగిన పంచాయతీలలో సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు రూ.2.50 లక్షలు ఖర్చు చేయొచ్చు. వార్డు మెంబర్ స్థానానికి పోటీ చేసే వారి ఖర్చు రూ.50 వేలకు మించకూడదు. ఐదు వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలలో సర్పంచ్ స్థానానికి రూ.1.50 లక్షలు, వార్డు స్థానానికి రూ.30 వేలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాగే సర్పంచ్ స్థానానికి పోటీ చేయ్యలనుకునేవారు గ్రామ పంచాయతీలో స్థానిక ఓటరై ఉండాలి. నామినేషన్ దాఖలు నాటికి అభ్యర్థి వయస్సు 21 సంవత్సరాలు నిండి ఉండాలి.

సెల్‌ఫోన్ల లైట్ వెలుతురులో.. నామినేషన్ల స్వీకరణ

» ఖిల్లాఘణపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం



ఖిల్లాఘణపురంలో సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో నామినేషన్లను స్వీకరిస్తున్న అధికారులు

ఖిల్లాఘణపురం నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో మొబైల్‌ఫోన్ లైట్ల వెలుగురులోనే రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించారు. శుక్రవారం అష్టమి కావడంతో పురోహితుల సూచన మేరకు ఎక్కువ మంది అభ్యర్థులు సాయంత్రం 4:30 గంటల తర్వాత నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. 5 గంటల వరకు అభ్యర్థులు, ప్రతిపాదకులు, సాక్షులు పదుల సంఖ్యలో వచ్చారు. పోలీస్ వారందరినీ క్యూలైన్లో నిలబెట్టారు. అదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అభ్యర్థి వెంట ఉన్న వారు మొబైల్‌ఫోన్‌లో లైట్లు వేశారు. ఆ వెలుతురులోనే రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించారు. అభ్యర్థులు ఎక్కువ మంది ఉండటంతో దాదాపు 2 గంటల పాటు వారు క్యూలైన్లో నిలబడాల్సి వచ్చింది. నామినేషన్ కేంద్రాన్ని ఎంపీడీవో విజయసింహారెడ్డి, సీఐ రాంబాబు, ఎస్‌ఐ వెంకటేశ్ పరిశీలించారు.

ఎర్రవల్లిలో సర్పంచ్ ఎన్నిక బహిష్కరణ

» డిండి ఎత్తిపోతల నిర్వాసితుల ఆందోళన

చారకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న గోకారం రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన నిర్వాసితులు, ఎర్రవల్లి గ్రామస్థులు సర్పంచు ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గ్రామస్థులు సమావేశం నిర్వహించుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించి ఊర్లు ముంపునకు గురి కాకుండా చూడాలని కోరారు. తమ ఆవేదనను ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.



న్యాయం చేయలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్న భూ నిర్వాసితులు

మీడియా సెంటర్ ద్వారా నిఘా

» నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంపై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. కలెక్టరేట్‌లో పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను అదనపు కలెక్టర్ దేవ సహాయం, పంచాయతీ కార్యదర్శి శ్రీరాములుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. 08540230201 నెంబరు అందరికీ అందుబాటులో ఉంటుందని, ఎవరైనా ఫిర్యాదులు చేయొచ్చని తెలిపారు. హెల్ప్‌లైన్ సెంటర్‌లో సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉంటారన్నారు. స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి, పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ ఉద్యోగులు రాము, శివ, వెంకటయ్య పాల్గొన్నారు.

నల్లమలలో పెద్దపులి

సఫారీ పర్యాటకులకు కనువిందు



రోడ్డుపై పడుకున్న పెద్దపులి

మన్ననూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ అభయారణ్యంలో సఫారీ పర్యాటకులకు పెద్దపులి దర్శనమిచ్చి కనువిందు చేసింది. జంగల్ సఫారీ కోసం ఉత్తర భారత దేశానికి చెందిన ఇద్దరు పర్యాటకులు ఆన్‌లైన్లో టికెట్లు బుక్ చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు వారు సఫారీ వాహనంలో గుండం అటవీ ప్రాంతానికి వెళ్తుండగా, ఓ పెద్ద పులి పొదల్లో నుంచి బయటకు వచ్చింది. వెంటనే సఫారీ డ్రైవర్ యాదయ్య, నేచర్ గౌడ్ ప్రశాంత్‌లు వాహనాన్ని నిలిపివేశారు. అతి సమీపంలో స్వేచ్ఛగా తిరుగుతున్న పెద్దపులిని పర్యాటకులు మొబైల్ ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకొని సంబురపడ్డారు. ఆ పెద్దపులి అక్కడే రోడ్డుపై కొద్దిసేపు పడుకొని ఆ తర్వాత అడవిలోకి వెళ్లిపోయింది. అది మగపులి (ఎం19) అని అటవీ అధికారులు భావిస్తున్నారు.

గడ్డివాము దగ్ధం

మరికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా, మరికల్ మండలం మాధవరం గ్రామానికి చెందిన రైతు లక్ష్మయ్యకు చెందిన గడ్డివాము శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఊరు శివారులో అతడు నిల్వ చేసుకున్న గడ్డివాముకు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గ్రా మస్థులు గమనించి సమాచారం అందించడంతో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాల్య వివాహం నిలిపివేత



కొత్తపల్లి మండలంలోని ఓ గ్రామంలో బాల్య వివాహాన్ని నిలిపివేసిన చైల్డ్ సంస్థ

కొత్తపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలో బాల్యవివాహం చేస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు ఆ గ్రామానికి వెళ్లి నిలిపివేయించారు. కొత్తపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికకు వికారాబాద్ జిల్లా, దౌల్తాబాద్ మండలంలోని మరో గ్రామానికి చెందిన యువకుడితో పెద్దలు పెళ్లి నిశ్చయించారు. ఈ నెల 30న వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ విషయం తెలియడంతో చైల్డ్‌లైన్ అధికారులు, పోలీసులతో పాటు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శి శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను బాల సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లారు.

మరుగుదొడ్ల స్థలం కబ్జాపై ఆగ్రహం

● మునిసిపల్ కార్యాలయం ఎదుట కాలనీవాసుల ధర్నా



అయిజ మునిసిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కాలనీవాసులు

అయిజ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అయిజ మునిసిపల్ కార్యాలయం ముందు కాలనీ వాసులు బైఠాయించి శుక్రవారం ధర్నా చేపట్టారు. అయిజ పట్టణంలోని 3వ వార్డులోని ఎస్సీ కాలనీలో సామూహిక మరుగుదొడ్డిని కొందరు వ్యక్తులు కూల్చి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. దీని కారణంగా మహిళలు బహిర్భూమికి వెళ్లటానికి ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. దీంతో పుర కమిషనర్ సైదులు వారితో మాట్లాడారు. కేటాయించిన అసెస్మెంట్ నెంబర్లు డిలీట్ చేస్తానని, రూ.20లక్షలతో అధునాతన సామూహిక మరుగుదొడ్డి నిర్మాణం చేపడతామని హామీ ఇవ్వటంతో సమస్య సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దేవరాజు, యేబు, షైనర్‌బాబు, కాలనీవాసులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో చోరీ

గద్వాల క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం, దౌదర్‌పల్లి సమీపంలోని డబుల్ బెడ్ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డబుల్ బెడ్ రూమ్ హెచ్ 1/107లో నివసిస్తున్న పద్మ, నాగరాజులు మూడు రోజుల క్రితం శ్రీరంగాపురంలో బంధువుల పెళ్లికి వెళ్లారు. శుక్రవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా, టీవీతో పాటు, 50 కిలోల బియ్యం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

న్యూస్ బాక్స్

శిక్షణ కలెక్టర్లకు జోక్స్ పుస్తకం అందజేత

వడ్డేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కార్యాలయంలో శిక్షణ కలెక్టర్లు రాజకుమార్, నన్నూరి మనోజ్ కుమార్‌ను శుక్రవారం శాంతినగర్ వాసి కవి, రచయిత షేక్ అస్లాం షరీఫ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను రచించిన 'నవ్వులే నవ్వులు' జోక్స్ పుస్తకాలను వారికి అందజేశారు. అదేవిధంగా శాంతినగర్ సేవా సమితి వడ్డేపల్లి ద్వారా చేపడుతున్న కార్యక్రమాల గురించి వారికి వివరించారు. అనంతరం శిక్షణ కలెక్టర్లు రచయితను అభినందించారు. మరెన్నో ఉత్తమ రచనలు చేయాలని, సేవా సమితి ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు : ఎస్ఐ

మానవపాడు,నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా చేసిన ఐదుగురిని తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు. సొంత పూచికత్తు రూ.లక్ష నగదుతో సంతకాలు చేయించుకుని పంపామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ దృష్ట్యా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కేసులు నమోదు చేస్తామని, గతంలో కేసులు ఉన్నవారిపై ప్రత్యేక నిఘా ఉంచామని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వడ్డేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దళారుల నుంచి రైతులను కాపాడేందుకు ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ మహిళా సంఘం నాయకులు సూచించారు. శుక్రవారం వడ్డేపల్లి మండలం కొంకల గ్రామ సంఘం పరిధిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సన్నరకం వడ్ల ధర రూ.2,369తో పాటు బోనస్ రూ.500, దొడ్డు రకం వడ్ల ధర రూ.2,389 ఇచ్చి కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాకు ప్రభుత్వం నగదు జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘం సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

● తహసీల్దార్ వీరభద్రప్ప

ఇటిక్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని తహసీల్దార్ వీరభద్రప్ప, ఎంపీడీఓ అజహర్‌మొయినుద్దీన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఇటిక్యాల ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామంలోని ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రతి గ్రామంలో పంచాయతీ అధికారులు అందుబాటులో ఉండి ఎన్నికల అధికారులకు సహకరించాలన్నారు. మండలంలో మూడవ విడత ఎన్నికలు జరుగుతాయని, ముందస్తుగా పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలను పరిశీలించుకోవాలన్నారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎన్నికల వేళ గ్రామాల్లోని ప్రజలు గుంపులుగా తిరగవద్దని, రూ.50వేల నగదును వెంట తీసుకెళ్లరాదని, సోషల్‌మీడియాలో ఎన్నికల ప్రచారాలు నిర్వహించరాదనే నిబంధనలను ప్రజలకు వివరించేలా దండోరా వేయించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఉన్నారు.

మెజారిటీ స్థానాల్లో సర్పంచులను గెలిపించాలి

● ఎన్నికల కన్వీనర్ రామచంద్రా రెడ్డి



మాట్లాడుతున్న ఎన్నికల కన్వీనర్ రామచంద్రా రెడ్డి

వడ్డేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే పంచాయతీ ఎన్నికల్లో మండలంలో మెజారిటీ స్థానాల్లో సర్పంచులను గెలిపించాలని బీజేపీ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా శుక్రవారం శాంతినగర్ పట్టణంలో వడ్డేపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు బోయ నాగరాజు ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సర్పంచు ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు బీజేపీకి మాత్రమే ఉందన్నారు.గ్రామ పంచాయతీలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేంద్రం ప్రభుత్వం నుంచే వస్తున్నాయన్నారు. సర్పంచు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నుంచి అధిక నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు,రవిగౌడ్, నరేష్, రాఘవేంద్ర, మండల యువ మోర్చా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రకాశం, రంగస్వామి, రాజు, కార్యకర్తలు ఉన్నారు.

● రాజోలి: రాజోలిలో బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెస్తామన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని చెప్పారు.

నామినేషన్ వేస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సిందే

- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ



శెట్టి ఆత్మకూర్ నామినేషన్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు



పరమాల నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలలో నామినేషన్ వేసిన అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. శుక్రవారం గద్వాల మండలం శెట్టిఆత్మకూర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్‌ను ఆయన తనిఖీచేశారు. దీని పరిధిలోని సంగాల, గోనుపాడు, మదనపల్లి, ఈడిగోనిపల్లి గ్రామాల అభ్యర్థులు కూడా నామినేషన్ వేస్తుండటంతో వాటి ఓటర్ లిస్టులను పరిశీలించారు. నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు పత్రాలలో వివరాలను సక్రమంగా పూర్తి చేయాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థుల నుంచి రిటర్నింగ్ అధికారులు దరఖాస్తులను ఏవిదంగా స్వీకరిస్తున్నారో పరిశీలించారు. నామినేషన్ వేసిన వారి వివరాలను ఎప్పటికప్పుడు రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్ప్‌డెస్క్ వద్ద విధులు నిర్వహిస్తున్న వారికి కలెక్టర్ సూచనలు చేశారు. ఎన్నికల పరిశీలకులు గంగాధర్ పాల్గొన్నారు.

సున్నితమైన గ్రామాలపై దృష్టి : ఎస్పీ

సున్నితమైన గ్రామాలపై దృష్టి పెట్టినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పరమాల గ్రామంలో నామినేషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దన్నారు. సెన్సిటివ్ గ్రామాల్లో ప్రత్యేక నిఘా, బందోబస్తు ఉంచామన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ నర్సింగరావు నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

బాల్య వివాహం చేసేందుకు ప్రయత్నిస్తే రెండేళ్లు జైలుశిక్ష

● బాల్య వివాహాలను నివారించడం అందరి కర్తవ్యం

● జిల్లా సంక్షేమాధికారి సునంద

గద్వాల క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం నేరమని, బాల్య వివాహాలను నివారించడం అందరి కర్తవ్యమని జిల్లా సంక్షేమాధికారి సునంద అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ బాల్యవివాహ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే దుష్పరిణామాల గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. బాల్య వివాహం చేసినా లేదా చేయడానికి ప్రయత్నించిన వారికి రెండు సంవత్సరాల కఠిన జైలుశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. బాల్య వివాహాల పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతో వారికి బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ కాంపిటేషన్, ఉపన్యాస పోటీలు, పాటల పోటీలు నిర్వహించారు. వీరిలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు శైలజ, డీఆర్‌డీఏ విభాగం వెంకటరావు, జిల్లా న్యాయసేవా విభాగం శ్రీనివాసులు, రాజేందర్, బాలల సంరక్షణ అధికారి నరసింహ, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎంఏఎల్‌డీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్



కళాశాలలో రికార్డులకు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

గద్వాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహారాణి మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022-24 రెండు విద్యా సంవత్సరాలకు సంబంధించి శుక్రవారం అకాడమిక్ ఆడిట్ నిర్వహించారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు డాక్టర్ ఏ.మీనాక్షి కన్వీనర్‌గా, డాక్టర్ నర్మద సభ్యురాలిగా ఉన్న కమిటీ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కళాశాలలోని అన్ని విభాగాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. కాగా, కళాశాల రికార్డుల నిర్వహణపై కమిటీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా తెలిపారు. కళాశాలను సందర్శించిన అధికారులు డాక్టర్ ఏ.మీనాక్షి, డాక్టర్ నర్మదను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రాధిక, అధ్యాపకులు మేడిచర్ల హరినాగభూషణం, డాక్టర్ సత్యన్న, డాక్టర్ సత్తెమ్మ, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ వెంకటేశ్వరమ్మ, సూపరింటెండెంట్ రమేశ్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



అయిజ ఎస్‌సీ హాస్టల్ విద్యార్థులతో తహసీల్దార్ జ్యోతి

అయిజ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని తహసీల్దార్ జ్యోతి సూచించారు. శుక్రవారం విద్యార్థులకు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్వెటర్లు, రగ్గులు అందజేశారు. అయిజ ఎస్‌సీ హాస్టల్ వార్డెన్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులు, సౌకర్యాలను ఉపయోగించుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని, వ్యక్తిగత శుభ్రత తప్పకుండా పాటించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు భోజన ఏర్పాట్లు, వంటగదిని పరిశీలించారు.

అన్నదాన సరుకుల అందజేత

గద్వాలఅర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద శుక్రవారం స్వాముల అన్నదానానికి కావాలిసిన సరుకుల వస్తువులను దాతలు కమిటీ సభ్యులకు అందజేశారు. మీర్జాపురం వెంకటేశ్వర రెడ్డి 300కేజీల కందిపప్పు, వీరబాబు, యాదేష్‌రెడ్డి 80 సిలిండర్లకు అయ్యే నగదు రూ.74వేలు, పూడూరు కేశవరెడ్డి వందలీటర్ల నూనె, వినయ్ ఆగ్రో ఇండస్ట్రీస్ జనార్ధన్ రెడ్డి(రాయచూరు) 500 కేజీల బియ్యం, గోపాల్‌రెడ్డి(రాయచూరు) 300 కేజీల బియ్యం అందజేశారు. దాతలు, వారి కుటుంబ సభ్యులు ఎల్లవేళలా అయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు ఉచిత వైద్యసేవ వార్షికోత్సవం

గద్వాల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దయానంద విద్యామందిర్‌లో గత ఏడాది ప్రారంభించిన ఉచిత వైద్యసేవలకు సంబంధించి ఈనెల 30వ తేదీ ఆదివారం వార్షికోత్సవ సభ ఏర్పాటు చేశామని విద్యాసమితి కార్యదర్శి బండ్ల నాగేశ్వర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం ఉచిత వైద్యసేవలు అందించే కార్యక్రమం ప్రారంభమైన ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించే తొలి వార్షికోత్సవం సందర్భంగా దివంగత తిమ్మప్ప ఆర్య సేవలు స్మరిస్తూ ఆయన పేరున నెలకొల్పిన ఆర్తిసదన్‌ను ప్రారంభిస్తామన్నారు. అనంతరం నిర్వహించే సభలో ఏడాది కాలంగా శిబిరం ద్వారా ఉచిత వైద్య సేవలు అందించిన వైద్యులను సన్మానిస్తామన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

అయిజ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం అయిజలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సర్పంచు అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడు, రాజశేఖర్, అంజి, నాగరాజు, శివన్న, గోపాల్, పరశురాములు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో మహిళల హక్కుల కోసం పోరాడుదాం







గద్వాలలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, మహిళా నాయకులు, బామ్‌సెఫ్ నాయకులు

గద్వాల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా విద్యతోనే సమాజ పురోగతికి మార్గమని నమ్మిన జ్యోతిబా పూలే స్ఫూర్తితో హక్కుల సాధన కోసం పోరాడుతామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే 135వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని దివంగత నేత విగ్రహానికి ఐద్వా మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మ, కాంతమ్మ, లక్ష్మి ఉన్నారు.

● బీజేపీ ఆధ్వర్యంలో : అసమానతల నివారణ విద్యతోనే సాధ్యమని నమ్మిన నిజమైన సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే అని బీజేపీ పట్టణ అధ్యక్షురాలు జయశ్రీ అన్నారు. జ్యోతిబా పూలే 135వ వర్ధంతిని పురస్కరించుకుని దివంగత నాయకుడి విగ్రహానికి బీజేపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవదాస్, అనిల్, నరసింహయ్య శెట్టి, కృష్ణ, రమేశ్, నరసింహయ్య, రామ్మోహన్, కవిత, వీరన్న, నరసింహులు ఉన్నారు.

● బామ్‌సెఫ్ నాయకుల నివాళి : జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా దివంగత నాయకుడి విగ్రహానికి బామ్‌సెఫ్ నాయకులు రామకృష్ణ, సిద్ధార్థ కృష్ణ, భాస్కర్, జయన్న, వాల్మీకి, సుందరరాజు, సురేశ్, సాయిసవరన్, రామన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, విద్యావ్యాప్తి కోసం నిబద్ధతతో కృషి చేసిన జ్యోతిబా పూలే చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమన్నారు. అదేవిధంగా ప్రజాసంఘాల నాయకులు ప్రభాకర్, సుభాన్, గోపాల్‌యాదవ్, నాగన్న, దానయ్య, కార్తీక్‌లు జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మల్దకల్ : అంటరానితనం, కులనిర్మూలన, మహిళల విముక్తితో పాటు చదువుతోనే సంఘం అభివృద్ధి చెందుతుందని విద్యావ్యాప్తికి మార్గదర్శకులైన మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని మల్దకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చాంద్‌బాష, తిరుమల్, స్టీవెన్‌సన్, రాజు, దేవేంద్ర, ముకేశ్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

● రాజోలి: మండల కేంద్రం రాజోలి బస్టాండ్ ఆవరణలో ఆటో యూనియన్ ఆఫీసులో శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల సహాయ కార్యదర్శి ఉపాధ్యాయులు రమేశ్ పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయకుమార్, సీఐటీయూ నాయకులు లక్ష్మన్న, నాయకులు మోగన్న, సుందర్ రాజు, నడిపి దస్తగిరి తదిరులు పాల్గొన్నారు.



అయిజలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

● యువతకు ఆదర్శం

అయిజ : అయిజలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సంఘ సంస్కర్తగా ఆయన చేసిన సేవలను నాగర్‌దొడ్డి వెంకట్రాములు కొనియాడారు. యువతకు ఆదర్శప్రాయుడైన ఆయన అడుగుజాడలలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన సెక్రటరి నర్సింహులు ఆధ్వర్యంలోనూ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

కేటీదొడ్డిలో 13 సర్పంచ్‌ల నామినేషన్లు దాఖలు



గట్టు: మిట్టదొడ్డి గ్రామ పంచాయతీకి నామినేషన్ దాఖలు చేస్తున్న మహిళా అభ్యర్థి

కేటీదొడ్డి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేటీదొడ్డి మండలంలో ఆయాగ్రామాల్లో సర్పంచు, వార్డు మెంబర్ల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మండలంలో శుక్రవారం సర్పంచు అభ్యర్థులుగా 13మంది నామినేషన్‌లు వేయగా, వార్డు మెంబర్ల అభ్యర్థులుగా ఐదు మంది నామినేషన్లు వేశారు. సర్పంచు అభ్యర్థులుగా పాతపాలెంలో 2, గంగన్‌పల్లిలో 3, ఇర్కిచేడులో 1, పూజారితండాలో 1, ఉమిత్యాలలో 2, షైలగడ్డలో 1, కేటీదొడ్డిలో 3 అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు. అలాగే వార్డు మెంబర్ల అభ్యర్థులుగా ఇర్కిచేడులో 1, షైలగడ్డలో 4 అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు. మొత్తంగా 13 మంది సర్పంచు అభ్యర్థులుగా, 5 మంది వార్డు మెంబర్ల అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు.

గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

అయిజ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అయిజ మండల పరిధిలోని కుర్వపల్లి, కిష్టాపూర్ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయినట్లు తెలిసింది. కుర్వపల్లి గ్రామ పంచాయతీకి శుక్రవారం వేలంపాట నిర్వహించగా రూ.7లక్షల 50 వేలకు ఒకరు దక్కించుకున్నట్లు సమాచారం. ఇదే గ్రామ పంచాయతీ వేలంపాట గతంలో రూ.8 లక్షలు పలికింది. మరో గ్రామ పంచాయతీ కిష్టాపూర్ గత ఎన్నికలకు ముందు రూ.10లక్షల 30 వేలు పలికింది. ఈసారి రూ.10.50 లక్షలు పలికినట్లు తెలిసింది. కాగా ఈ రెండు పంచాయతీలు జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యాయి.

రెండో విడతకు సన్నద్ధం



ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్న అధికారులు, సిబ్బంది

అయిజ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండో విడత ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. అయిజ ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు పత్రాలను, ఫైల్స్‌ను సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నారు. అయిజ మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో 270 పోలింగ్ కేంద్రాలను, 11 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఈనెల 30వ తేదీ నుంచి నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభం అవుతుంది.

కేసీఆర్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యం



అయిజలో దీక్షా దివస్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

● అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అయిజ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌తోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం అయిజలో బీఆర్ఎస్ జిల్లా కన్వీనర్ పల్లయ్య ఆధ్వరంలో దీక్షా దివస్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వృద్ధులు, రైతులు, మహిళలు అన్నివర్గాల వారిని ఆదరించిన ఘనత బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధించి, అభివృద్ధి చేశారని అన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉండేది టీఆర్ఎస్ మాత్రమే అన్నారు. 29న శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తలపెట్టిన దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద మొత్తంలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి, నర్సింహారెడ్డి, మాల నర్సింహులు, హనుమంతురెడ్డి, సీతారామిరెడ్డి, రఘురెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లయ్య, భద్రయ్య, దేవన్న, యేబు, మల్లికార్జున్, సుమలత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ తాజా మాజీ ఎంపీపీ



మాజీ ఎంపీపీకి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సంపత్‌కుమార్

అయిజ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు తాజా మాజీ ఎంపీపీ ఉప్పల ప్రహ్లాద రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని అలంపూర్ మాజీ ఎంఎల్ఏ సంపత్‌కుమార్ ఇంటిలో కలిశారు. అనంతరం సంపత్‌కుమార్ కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని భావించి బీఆర్ఎస్‌ను వీడి పార్టీలో చేరినట్లు ప్రహ్లాదరెడ్డి తెలిపారు. సంపత్‌కుమార్ సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అభివృద్ధి కోరి వచ్చే అందరికీ పార్టీ ఆహ్వానం ఎల్లప్పుడూ ఉంటుందని సంపత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఎస్ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి, యాపదిన్నె సోమశేఖరరెడ్డి, యూత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దీపక్ పాల్గొన్నారు.

ఏకగ్రీవాల పేరుతో ప్రజాస్వామ్యం అపహాస్యం

● జిల్లాలో వేలంపాటలపై సమగ్ర విచారణ చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

గద్వాల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏకగ్రీవాల పేరుతో జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న తంతు ప్రజాసామ్యాన్ని అపహాస్యం చేసేదిగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. సర్పంచు పదవులకు జరుగుతున్న వేలం రాజకీయాలను మరింత కలుషితం చేసేదిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వెంకటస్వామి మాట్లాడారు. గ్రామాల్లో ఏకగ్రీవాల పేరుతో కొద్దిమంది పెత్తందారులు ఓటర్లను శాసించే దుస్థితి తలెత్తిందన్నారు. పోటీ చేసేందుకు సిద్ధపడిన యువకులను సైతం బెదిరింపులు, ఒత్తిడికి గురిచేస్తుండటం గర్హనీయమన్నారు. ఏకగ్రీవాలు జరిగిన పంచాయతీలకు గతంలో ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ప్రోత్సాహక సొమ్ము అందని విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. విద్యావంతులైన యువకులు గ్రామాల అభివృద్ధి కోసం ఎన్నికల బరిలో నిలిచి ప్రజాస్వామిక స్ఫూర్తికి జీవం పోయాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు వీవీ నరసింహ, రాజు, సవారన్న, ఉప్పేరు నరసింహ ఉన్నారు.

● విచారణకు సీపీఐ డిమాండ్

జిల్లాలో ఏకగ్రీవాలు జరుగుతున్న గ్రామ పంచాయతీలపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని సీపీఐ నాయకులు రంగన్న, ఆశన్న, ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఏకగ్రీవం పేరుతో రూ.లక్షలు వెచ్చిస్తున్న అభ్యర్థుల ఆర్థిక లావాదేవీలపై ఐటీ, ఈడీ అధికారులు నిఘా పెట్టాలన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన నాయకులు ఏకగ్రీవం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమన్నారు. గ్రామాల్లో ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన సర్పంచులే ప్రథమ పౌరులుగా ఉండి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలన్నారు. విద్యావంతులైన యువతీయువకులు గ్రామస్థాయిలో ఎన్నికల బరిలోకి రావాలని కోరారు.